www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 11 ఫిబ్రవరి 2025
5
తూర్పుగోదావరి

పది పరీక్షలకు 24,763 మంది విద్యార్థులు

తాళ్లపూడి : మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు తూర్పుగోదావరి జిల్లాలో 24,763 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకానున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు. సోమవారం ఆయన తాళ్లపూడిలోని స్పెషల్ పాఠశాలను సందర్శించారు. అనంతరం వేగేశ్వరపురంలో కైగాల సూర్యం(ద్రావపు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహార పదార్థాల రుచి, శుభ్రత విషయాలపై విద్యార్థుల అడిగి సమాచారం సేకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులతో 960 మంది సప్లిమెంటరీ విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 134 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

'కోడ్' లేదు.. సలాంలే..!

టిడిపి అభ్యర్థి నామినేషన్‌లో నిబంధనలు బేఖాతరు
కలెక్టరేట్ గేటు వరకూ వందలాది మంది టిడిపి నేతలు, కార్యకర్తలు
కలెక్టరేట్ లోపలికి మంత్రులు, ఎంఎల్ఎలు, అనుచరులు 22 మందిపైనే
ప్రభుత్వ అధీనంలోని ఇండోర్ స్టేడియంలో వేలాది మందికి భోజనాలు
సలాం కొడుతూ చేతులెత్తేసిన పోలీసులు, అధికారులు

కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

ముగ్గురితో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులు (ఫైల్)

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అధికార పార్టీ ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నామినేషన్ ప్రక్రియలో పోలీసులు, అధికారులు సలాం కొడుతూ, ఎన్నికల నిబంధనలను గాలికొదిలేశారు. ఎన్నికల నిబంధనలకు పాతరేస్తూ మంత్రులు, ఎంఎల్‌ఎలు, టిడిపి నేతలు వ్యవహరించిన తీరు అందరినీ విస్మయానికి గురిచేసింది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం సోమవారం నామినేషన్ వేశారు. ఈ నామినేషన్ ప్రక్రియలో అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘన సాగింది. నిబంధనలు ఇతర పక్షాలకేగాని, అధికారపక్షానికి వర్తించవు అన్నట్లుగా పోలీసులు, అధికారులు చేతులెత్తేసిన కన్పించింది. స్థానిక అమీనాపేటలోని టిడిపి కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. నిబంధనల ప్రకారం నామినేషన్ వేసే కలెక్టర్ కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు మాత్రమే నాయకులు, కార్యకర్తలకు అనుమతి ఉంటుంది. అక్కడి నుంచి అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు అనుమతిస్తారు.

ఇప్పటి వరకు నామినేషన్లు వేసిన అభ్యర్థులంతా ఇవే నిబంధనలు పాటించేలా పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరించారు. చివరి రోజు సోమవారం అధికారపక్ష అభ్యర్థి విషయంలో నాయకులను అదుపు చేయకుండా పోలీసులు చేతులెత్తేశారు. వంద మీటర్ల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్‌లు దాటి కలెక్టరేట్ గేటు వరకు సుమారు 500 మంది కార్యకర్తలు, నాయకులు చేరుకున్నారు. గేటుదాటి కలెక్టరేట్‌లోకి దాదాపు 22 మంది వరకు వెళ్లిన పరిస్థితి ఉంది.

నిబంధనలు బేఖాతర్ చేసిన మంత్రులు, ఎంఎల్ఎలు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి)తోపాటు గోదావరి జిల్లాలకు చెందిన పలువురు ఎంఎల్ఎలు ఎన్నికల నిబంధనలను ఏమాత్రం పట్టించుకోలేదు. వంద మీటర్ల వద్ద నాయకులను, కార్యకర్తలను అదుపుచేయాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు. డిఎస్‌పి స్థాయి అధికారి సైతం ఏమీ చేయలేకపోయారు. కలెక్టరేట్ గేటు దాటి 20 మందికిపైగా లోపలికి వెళ్లడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ ఫొటోగ్రాఫర్లు కలెక్టరేట్ కాంపౌండ్‌లో డ్రోన్ కెమెరా ఎగరవేసినప్పటికీ పోలీసులు మౌనంగా ఉండిపోయారు. ఒక ఎఎస్‌పి, ఒక డిఎస్‌పి స్థాయి అధికారులతోపాటు పలువురు సిఐలు, ఎస్ఐలు ఉన్నప్పటికీ ఎన్నికల నిబంధనలను అమలు చేయడంలో విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా పార్టీ కార్యక్రమాలకు ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు ఉపయోగించుకోకూడదని నిబంధనల్లో ఉంది. అయినప్పటికీ ఇండోర్ స్టేడియం మైదానంలో సుమారు ఆరు వేల మందికి భోజన ఏర్పాట్లు చేయడం గమనార్హం. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని నిర్మాణంలో ఉన్న భవనంలో మాజీ ఎంఎల్ఎ బడేటి చంటి ఫొటోతో కూడిన ఫ్లెక్సీలు పెట్టి మరీ అల్పాహారం, భోజనం ఏర్పాట్లు చేయడం గమనార్హం. టిడిపి కార్యాలయం వద్ద రోడ్లపై ఫ్లెక్సీలు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేయడం చూస్తుంటే నిబంధనలు అధికార పక్షానికి వర్తించవా అనే ప్రశ్న తలెత్తుతోంది. మూడు రోజుల క్రితం పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డి.వి.రాఘవులు నామినేషన్ కార్యక్రమంలో అనేక ప్రజాసంఘాల నాయకులు ర్యాలీగా పాల్గొన్నప్పటికీ కేవలం ఐదుగురిని మాత్రమే కలెక్టరేట్‌కి పంపించారు. ఈ నిబంధన అధికార పార్టీ అభ్యర్థి విషయంలో ఎందుకు అమలు చేయలేకపోయారో ఉన్నతాధికారులే చెప్పాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలయ్యేలా చూడాలని అంతా కోరుతున్నారు.

ఇండోర్ స్టేడియంలో భోజనాలు

జెడ్‌పిలో మాజీ ఎంఎల్ఎ బడేటి బుజ్జి ఫ్లెక్సీలతో చేసిన భోజన ఏర్పాట్లు

కలెక్టరేట్‌లో డ్రోన్

బర్డ్ ఫ్లూతో బెంబేలు

- నిర్ధారించిన పూణె ల్యాబ్
- అధికార యంత్రాంగం అప్రమత్తం

బర్డ్‌ఫ్లూతో మృత్యువాత పడిన కోళ్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

బర్డ్ ఫ్లూ కారణంగానే కోళ్ల మృత్యువాత పడుతున్నట్లు నిర్ధారణైంది. జిల్లాలో గత పదిహేను రోజులుగా వైరస్ సోకడంతో కోళ్ల మృత్యువాత పడుతున్నాయి. ఈ నేపథ్యంలో 83 నమూనాలను పూణేలో ల్యాబ్‌కు పంపించారు. అక్కడ కోళ్లకు సోకిన వైరస్ ఎవిఎన్ ఇన్‌ఫ్లూయింజా(బర్డ్ ఫ్లూ)గా నిర్ధారిస్తూ ల్యాబ్ నివేదికను అందించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. దీనిపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులతో అత్యవసర సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.

కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎవిఎన్ ఇన్‌ఫ్లూయింజా నివారణ, నియంత్రణ కార్యాచరణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పెరవలి మండలం కానూరు గ్రామంలోని పౌల్ట్రీ ల్లో బర్డ్ ఫ్లూ శాంపిల్స్ పాజిటివ్‌గా పూణే ల్యాబ్ నిర్ధారించిందన్నారు. కానూరు గ్రామం పరిధిలో ఒక కిలోమీటర్ మేర రెడ్ జోన్‌గా, పది కిలోమీటర్ల మేర సర్వేలెన్స్ జోన్‌గా ప్రకటించామన్నారు. అలాగే నల్లజర్ల, సీతానగరం మండలం మిర్తిపాడులో కూడా పౌల్ట్రీ కోళ్ల చనిపోయినట్లు సమాచారం ఉన్నందున అధికారులు ఆయా ప్రదేశాల్లో కూడా ఒక కిలోమీటర్ మేర రెడ్ జోన్, 10 కిలోమీటర్ల పరిధిలో సర్వేలెన్స్ జోన్‌గా ప్రకటించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిధిలో 144, 133 సెక్షన్లు అమలు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎక్కడైనా బర్డ్స్ చనిపోతే వెంటనే పశుసంవర్ధక శాఖకు సమాచారాన్ని అందించాలన్నారు. ఆయా పౌల్ట్రీ నుంచి ఒక కిలోమీటర్ లోపు బర్డ్స్(కోళ్లు), కోడిగుడ్లను కాల్చి వేయాలన్నారు. ఇప్పటికే 75 శాతం కాల్చి వేశారన్నారు. గత ఐదు రోజుల్లో పౌల్ట్రీ నుంచి కోళ్లను ఏఏ ప్రాంతాలకు రవాణా చేశారో సమాచారం తెలుసుకోవాలని రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. కానూరు గ్రామానికి ఎటువంటి బర్డ్స్ రాకుండా వెలుపలకి, బయటికి వెళ్లే మార్గాలను తాత్కాలికంగా మూసివేయాలన్నారు. ఒక్కొక్క గ్రామానికి అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులను, డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐలను నియమించామన్నారు. ప్రజలు కొన్ని రోజులు పాటు చికెన్ తినడం తగ్గించాలని సూచించారు. కానూరు పరిధిలో 10 కిలోమీటర్ల లోపు ఇంటింటా సర్వే నిర్వహించి, ప్రజల్లో ఏమైనా బర్డ్ ఫ్లూ లక్షణాలు ఉన్నది లేనిది ? తెలుసుకొని వైద్యసాయం అందించాలన్నారు. ఈ మేరకు వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. చికెన్ షాపులను గుర్తించి కొన్ని రోజులు షాపులను మూసివేయడంతో పాటు, అక్కడ పనిచేస్తున్న వారికి వెంటనే వైద్య సాయం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఉంటే వెంటనే సమాచారాన్ని కంట్రోల్ రూమ్(95429 08025)కు అందించాలన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 ఇది అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌లో డాక్టర్ భరత్ అందుబాటులో ఉంటారన్నారు. వైరస్ ప్రబలకుండా ప్రతి మండలంలో ఇంటింటికీ 2 శాతం సోడియం క్లోరైడ్ పిచికారీ చేయాలన్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు నిడదవోలు పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు వైరస్ ప్రబలకుండ ముందస్తు కార్యాచరణను అమలు చేయాలన్నారు. జిల్లాలో వలస పక్షుల వివరాలు వాటి మరణాలతో కూడిన జాబితాను సిద్ధం చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఆదేశించారు. రోజువారీ నివేదిక ప్రభుత్వానికి అందించాల్సి ఉన్నందున విధులు నిర్వహించే సంబంధిత అధికారులు ప్రతిరోజు డేటాను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున అధికారులు వైరస్ వ్యాప్తి కాకుండా నివారించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించే విధంగా టామ్ టామ్ వేయించాలన్నారు. జిల్లా అదనపు ఎస్‌పి ఎ.సుబ్బ రాజు మాట్లాడుతూ వైరస్ నియంత్రణ పై ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ టి.సీతారామమూర్తి, డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు, డిపిఒ వి.శాంతామణి, మున్సిపల్ అదనపు కమిషనర్, మున్సిపల్ మెడికల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ షాపులో తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని బర్డ్‌ఫ్లూ కట్టడిలో భాగంగా సోమవారం నగరంలోని జాంపేట ఏరియాలో గల కోళ్ల పెంపక కేంద్రాలను, అమ్మకపు కేంద్రాలను పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులతో కలిసి కమిషన్ కేతన్‌గార్గ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరవలి, కానూరు గ్రామాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాపించిందని నిర్ధారణ కావడంతో తనిఖీలు చేపట్టాలమన్నారు. ఆయా ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు కోళ్ల రవాణా జరగకుండా కట్టడి చేసేందుకుఉ చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు కూడా కొన్ని రోజుల పాటు చికెన్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కోటిపల్లి బస్టాండు జంక్షను నుంచి రోడ్ కం రైలు బ్రిడ్జి వెళ్ళే రహదారిని పరిశీలించారు. రాబోయే పుష్కరాల దృష్ట్యా ఈ రోడ్డు చాలాకీలకంగా ఉంటుందని, డ్రెయిన్లపై ఉన్న మొత్తం ఆక్రమణలను తొలగించామని, డ్రెయిన్లకు కూడా మరమ్మతులు చేయాలాని ఆదేశించామన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మాధవి తదితరులున్నారు.

14న పిడిఎస్ బియ్యం వేలం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వివిధ 6ఎ కేసుల్లో సీజ్ చేసిన 47.274 మెట్రిక్ టన్నుల పిడిఎస్ రైస్ (ప్రజా పంపిణీ బియ్యాన్ని)ను ఈ నెల 14న వేలం వేయనున్నట్లు జెసి చిన్నరాముడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో, దేవరపల్లిలోని శ్రీవేంకటేశ్వర రైస్ మిల్లులో ఈ బియ్యాన్ని ఉంచామన్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని కిలో ఒక్కింటికి రూ.20 చొప్పున ధర నిర్ణయించి బహిరంగ వేలం వేస్తామన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

మొత్తం 59 మంది అభ్యర్థులు, 72 నామినేషన్లు
నేడు నామినేషన్ల పరిశీలన.. 13 వరకూ ఉపసంహరణకు గడువు



నామినేషన్ పత్రాలు అందిస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల పర్వం సోమవారంతో ముగిసింది. జనవరి 29న ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి మూడో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. పదోతేదీ సోమవారం సాయంత్రం నామినేషన్ల స్వీకరణ ముగిసింది. ఎంఎల్‌సి ఎన్నికల రిట్నరింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నామినేషన్లను స్వీకరించారు. నామినేషన్ల గడువు ముగిసేసరికి మొత్తం 59 మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కొంతమంది అభ్యర్థులు రెండేసి చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఏడో తేదీ శుక్రవారం, చివరిరోజు సోమవారం అత్యధిక నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ ముగియడంతో 11వ తేదీ మంగళవారం నామినేషన్ల పరిశీలన జరగనుంది. నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీతో గడువు ముగియనుంది. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో ఎంతమంది నిలిచారో అభ్యర్థుల జాబితా తేలనుంది. ఈ నెల 27వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ జరగనుంది. మార్చి మూడో తేదీన కౌంటింగ్ ప్రక్రియ ఏలూరులో నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 440 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. అవసరాన్ని బట్టి పోలింగ్ కేంద్రాల పెంపునకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పిడిఎఫ్, టిడిపి అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్ట భద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు, టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజ శేఖరం మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. నిరుద్యోగులు, ఉద్యోగ, కార్మికులంతా పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతు తెలుప ుతున్నారు. టిడిపి తన అధికార బలాన్ని ఉపయోగించి ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తోందనే ఆరో పణలు వెల్లువెత్తు తున్నాయి. మంత్రులు, ఎంఎల్ఎలు, స్థానిక నాయకులంతా తమ సర్వశక్తులు ఒడ్డుతున్న పరిస్థితి ఉంది. టిడిపి అభ్యర్థి నామినేషన్ రోజున నిబంధనలు లెక్కచేయకుండా ముందుకు సాగడంతో ఎన్నికలు దగ్గర పడే కొద్ది పరిస్థితి ఎలా ఉంటుందోననే చర్చ సర్వత్రా సాగుతోంది. ఏదేమైనా ఎంఎల్‌సి ఎన్నికలు రసవత్తరంగా సాగే పరిస్థితి కన్పిస్తోంది.

గోదావరి బాలోత్సవం వాయిదా..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో ఈనెల 23, 24 తేదీల్లో జరగాల్సిన గోదావరి బాలోత్సవం మూడో పిల్లల పండుగ కార్యక్రమాన్ని ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేయడానికి నిర్ణయం తీసుకున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు వివిఎస్ఎస్.కృష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి మాట్లాడారు. ఎంఎల్‌సి ఎన్నికలు ఈనెల 27న జరుగుతాయని ఎన్నికల కోడ్ మార్చి 8 వరకు కొనసాగుతుందని తెలిపారు. మార్చిలో నిర్వహించడానికి ప్రయత్నాలు చేసినప్పటికీ వరుసగా మార్చి, ఏప్రిల్ నెలల్లో పదో తరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షలు, మిగిలిన తరగతుల పరీక్షలు ఉండటం, ఆ తరువాత వచ్చే వేసవి సెలవులను దష్టిలో పెట్టుకుని వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభమైన తరువాత జులైలో నిర్వహిస్తే మేలన్న నిర్ణయానికి వచ్చామన్నారు. విద్యార్థులకు అప్పుడే విద్యాసంవత్సరం ప్రారంభమవుతుందని, ఆహ్లాదకరంగా అందరూ పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. జులైలో నిర్వహించే బాలోత్సవం తేదీలను పాఠశాలలు తెరచిన తర్వాత ప్రకటిస్తామని చెప్పారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థిని, విద్యార్థుల పేర్లు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు తేదీలు ప్రకటించాక వీలు కల్పిస్తామన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు. ఇప్పటికే చాలా మంది రిజిస్టర్ చేసుకున్నారని వారిలో నిరుత్సాహం ఉన్నప్పటికి జులైలో జరిగే బాలోత్సవంలో పాల్గొనాలని సూచించారు. ఈ అనివార్య కారణాలను అర్థం చేసుకొని తమకి సహకరించాలని వారు కోరారు. ఇప్పటికే డిఇఒ, ఎంఇఒలకు లేఖల ద్వారా బాలోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్టు సమాచారాన్ని పంపి పాఠశాలలకు చేరవేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సాయిబాబా, ఉపాధ్యక్షులు నవీనకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం సరిహద్దులను గుర్తించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

కొలతల ప్రకారం సరిహద్దులను కచ్చితంగా గుర్తించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం తాళ్లపూడి సచివాలయంలో కలెక్టర్ ప్రశాంతి, ఆర్‌డిఒ రాణి సుస్మిత, సర్వే అధికారితో కలిసి రీసర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ సర్వే రికార్డ్ క్షేత్ర స్థాయి భూమిపై డేటాను సర్వే చేసే సమయంలో రెండు రికార్డ్‌ల వివరాలు సరిపోవాలన్నారు. సర్వే సమయంలో అటువంటి సమస్యలు గుర్తించడం, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై వివరణ కోరారు. ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడంలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే సర్వే బృందం జవాబుదారీతనం కలిగి ఉండాలని ఆదేశించారు. జియోలొకేషన్ రికార్డ్, ఇమేజ్ ఫీచర్‌లను ధృవీకరించడానికి భూమిపై వాస్తవికత ఆధారంగా గ్రౌండ్ ట్రూటింగ్ సహాయపడుతుందన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ ద్వారా భూముల సరిహద్దులను గుర్తించడం సులభతరం చేస్తుందన్నారు. ఎటువంటి వివాదాలు తావులేకుండా పారదర్శకంగా ఉండేలా తోడ్పాటు పడుతుందని తెలిపారు. కొలతల ప్రకారం లేని పక్షంలో ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగింది, సంబంధించిన యజమానులకు నోటీసు జారీ చేసి వాస్తవ భూ కొలతలు ఆధారంగా సర్వే నెంబర్‌లో ఉన్న భూమి సరిపోవాలని స్పష్టం చేశారు.రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను, మార్గదర్శకాలు మేరకు సమయపాలన పాటించాలని ఆదేశించారు. రీ సర్వేలో అభ్యంతరాలు ఉంటే వాటిని అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడాలన్నారు. ఆ మేరకు పరిష్కారం చేయాలని సూచించారు. ఈ పర్యటనలో పెరవలి మండలం క్షేత్ర స్థాయి సర్వే సిబ్బంది, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

ఇప్పడిలాగే అంటారు... పంట పండించాక గిట్టుబాటుధర ఇవ్వరు.. ఇక ప్రోత్సాహం ఏం వుంటుందని అడుగుతున్నాడు సార్!

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో అన్ని విద్యాసంస్థల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండోజోల్ మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. అన్ని పిహెచ్‌సిల పరిధిలో వైద్య సిబ్బంది పాఠశాలలకు వెళ్లి ఈ మాత్రలను పంపిణీ చేశారు. **తాళ్లపూడిలో** జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం తాళ్లపూడి మండలం వేగేశ్వర పురం కె ఎస్ ఆర్ జిల్లాపరిషత్ హై స్కూల్ నందు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 4,30,339 పిల్లలకు లక్ష్యనికి గాను 4,07,961 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేశామన్నారు. 94.8 శాతం మేర లక్ష్యసాధన పూర్తి చేసామన్నారు. మిగిలిన వారికీ ఈ నెల 17న వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వర రావు, కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఇన్‌ఛార్జి డాక్టర్.ధర్మరాజు, ఆర్‌పిఎస్ కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలోని ఉండ్రాజవరం, వేలివెన్ను పిహెచ్‌సిల వైద్యాధికారుల ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు ఈ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు ఆర్ఎస్ఎస్‌వి.ప్రసాద్, ఆర్.ఉషాదేవి, ఎస్‌జె.ఇర్ఫాన్ వ్యక్తిగత, చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు సిహెచ్.సక్సేనారాజు, డి.శారదజ్యోత్స్న, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్‌కె.ఖాన్, ఎంఎల్‌హెచ్‌పి కరీం, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **చాగల్లు** మండలం చాగల్లు, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం, కలవలపల్లి పిహెచ్‌సిల వద్ద నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు వైద్యాధికారి ఎడ్ల తనుజ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్, పిహెచ్ఎన్ షేక్ జమీల, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆశాలు పాల్గొన్నారు. **కడియం** ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలను వేశామని కడియం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న తెలిపారు. 7,128 మందికి 6,852 మందికి మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు. 96 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.నాగ సాయిమౌర్య, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పిలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. **పెరవలి** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న విద్యాసంస్థల్లో 98 శాతం పిల్లలకు ఆల్బెండోజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి. వైద్యాధికారులు డాక్టర్ కె.హేమరాజు, డాక్టర్ పి.తేజశ్రీ, సిహెచ్ఒ కె.జయమణి, ఎంపిహెచ్ఇఒ జి.సత్యేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** కొత్తపల్లి పిహెచ్‌సి పరిధిలో గల అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ సెంటర్లలో నులిపురుగుల నివారణా దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ బి.గౌరమ్మ ఆధ్వర్యంలో జి.కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్. నిఖిత సమక్షంలో ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

చివటంలో ఆకుకూరల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చివటం గ్రామంలో, కార్యదర్శి జివివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం ఆకుకూరలు పంపిణీ చేశారు. పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సిబ్బంది స్వయంగా పండించిన ఆకుకూరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు కెకెడి.బేబిరాణి, సూర్యకుమారి, నిర్మల, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

శీలధిలో ఘనంగా కలర్స్ డే

ప్రజాశక్తి - కోరుకొండ

మండల కేంద్రమైన కోరుకొండలోని శీలధి గ్లోబల్ పాఠశాలలో కలర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పర్పుల్ కలర్స్ డే ను సోమవారం ఘనంగా నిర్వహించారు. పర్పుల్ కలర్ దుస్తులు వేసుకుని విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పర్పుల్ కలర్ ఆట బొమ్మలు, వస్తువులను ప్రదర్శనగా పెట్టారు. పర్పుల్ కలర్ దుస్తులతో విద్యార్థులు చేసిన ఆటపాటలు, నత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గరగ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ సత్యలక్ష్మి, అకడమిక్ ఇన్చార్జ్ పద్మావతి, ఉపాధ్యాయులు రూప, ప్రసాద్, షర్మిల, తబసమ్, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నగల షాపులో చోరీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక మెయిన్ రోడ్‌లోని శ్రీ సిద్ధనాథ్ జ్యూయలరీ షాప్‌లో చోరీ శనివారం రాత్రి జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలావున్నాయి.. జ్యూయలరీ షాప్ యజమాని గార్లే శివాజీ శనివారం రాత్రి దుకాణం మూసేసి వెళ్ళిపోయాడు. యథావిధిగా సోమవారం దుకాణం తెరిచారు. షాపులో సామాన్లు చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డిఎస్‌పి డి.శ్రీహరిరాజు, సిఐలు బి.సూర్య అప్పారావు, వైఆర్‌కె.శ్రీనివాసరావు సోమవారం సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సాయంతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ 32 కిలోల వెండి, 50 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు తెలిపారు. అయితే బంగారం ఉన్న లాకర్‌ను బద్దల కొట్టలేదని తెలిపారు. సినీ పక్కిలో షాపు వెనుక నిర్మానుష్య ప్రదేశం కావడంతో డ్రిల్లింగ్ మిషన్‌తో గోడకు రంధ్రం చేసి లోపలికి చొరబడి చోరీకి పాల్పడ్డారన్నారు. దొంగతనం ఆనవాళ్లు తెలియకుండా దుకాణంలోని సిసి కెమెరా, డివిఆర్‌ను తొలగించుకుని పోయారని తెలిపారు. నిందితుల ఆచూకీ తెలుసుకునేందుకు క్రైమ్ బ్రాంచ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. తొందరలోనే దొంగలను పట్టుకుని చోరీకి గురియైన వస్తువులను రికవరీ చేస్తామని ఆయన తెలిపారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణ శివారు ఏలేరు పంట కాలువ గట్టుపై నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,78,840 నగదును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాజులూరులో... కాజులూరులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు. సోమవారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో కాజులూరులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.11,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టులో హాజరు పరిచనున్నట్లు తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తూర్పుపాకలు శివారులో సోమవారం నిర్వహిస్తున్న కోడిపందాలపై ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందాలు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి 2 కోళ్లు, రూ.1120 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

పిడిఎస్ రైస్ స్వాధీనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ రైసును పౌరసరఫరాల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక గాంధీనగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో సోమవారం రెవెన్యూ సిబ్బంది, పౌర సరఫరాల శాఖ, పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 1749 కేజీలు రేషన్ బియ్యన్ని కనుగొన్నారు. ఈ బియ్యం మొగిలి దుర్గానందరావు, సిరిపిరెడ్డి వీరభద్రరావులకు చెందినదిగా గుర్తించారు. ఈ బియ్యం విలువ రూ.80,500 ఉంటుందన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పిఠాపురం పౌరసరఫరాల గోడౌన్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

సెంట్రింగ్ కర్ర తగిలి యువకుని దుర్మరణం

ప్రజాశక్తి - మండపేట

సెంట్రింగ్ కర్ర తగిలి యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు ఇవి.. పట్టణానికి చెందిన కొమ్మిశెట్టి సుబ్బారావు, శ్రీలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. తండ్రి వ్యవసాయం, కుమారులు ఇద్దరు సెంట్రింగ్ పని కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరికి కూడా భార్యా పిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు కొమ్మిశెట్టి సత్తిబాబు సోమవారం ఉదయం తన ఆటోలో సెంట్రింగ్ కర్రలు పట్టుకుని అనపర్తి పనికి వెళ్లాడు. అనుకోకుండా ప్రమాదవశాత్తు సెంట్రింగ్ కర్ర సత్తిబాబు గూబకు తగలింది. స్థానికులు అతనిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే క్షతగాత్రుడు మరణించినట్టు నిర్ధారించారు. అయితే గత ఏడాది మార్చి 11న చిన్న కుమారుడు కొమ్మిశెట్టి వెంకటేష్ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు.

ఎంఎల్ఏ గొల్లపల్లితో మాట్లాడుతున్న రైతులు

సాగునీటి సమస్యపై రైతుల వినతి

ప్రజాశక్తి - యానాం

యానాం శివారు దరియాలతిప్పలోని పంటపొలాలకు సాగు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని, సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత రైతులు ఎంఎల్ఏ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను కోరారు. గత వారం రోజులుగా అధికారులు చుట్టూ తిరుగుతున్న కనీసం స్పందన లేదన్నారు. కనకాల పేట శివారు అరటికాయ లంక దగ్గర గల పంప్ హౌస్ దగ్గర రింగ్ బండ్ కట్టాలని గత ఏడాది నుంచి కోరుతున్నా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని, కనీసం టెండర్ పిలవలేదన్నారు. అధికారులు కావాలనే రైతులు పట్ల వివక్ష చూపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రాంతీయ పరిపాలన అధికారితో సమావేశం ఏర్పాటు చేసి సాగునీటి నివారణకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు తిరుకోటి భైరవమూర్తి, కోరుకొండ ఆనందరావు, సబ్బతీ రాంబాబు, వాకపల్లి వేంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వాలి

ప్రజాశక్తి - పిఠాపురం

భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ భోజనం పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందివ్వాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సిద్దు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజన కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం పథకం ద్వారా ఎందరో విద్యార్థులకు కొంత మేలు చేకూరిందన్నారు. కానీ, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందివ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలందయ్యిందన్నారు. కళాశాలలో సుమారు 600 నుంచి 700 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారిలో హాస్టల్ విద్యార్థులు సుమారు 150 మంది ఉన్నారని తెలిపారు. అయితే భోజనం చేయడానికి విద్యార్థులు మొగ్గు చూపడం లేదన్నారు. ప్రధాన కారణం నాణ్యమైన భోజనాన్ని అందివ్వకపోవడమేనని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్ కుమార్, వివివి.రమణ, దుర్గాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో 'ఓపి'క లేదు...!

మొరాయించిన సర్వర్ - రోగుల ఇక్కట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

ఒపి సెంటర్ వద్ద పడిగాపులు పడుతున్న రోగులు

వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లిన రోగుల వద్ద ఒపి చీట్లు పొందాలంటే గంటల తరబడి నిలబడగలిగే ఓపిక ఉండాల్సిందే. స్థానిక సిహెచ్‌సిలో సర్వర్ల పని చేయక ఓపి టికెట్లు నమోదు కాని పరిస్థితి ఏర్పడింది. ఒపి పూర్తి కాకపోతే రోగులు వైద్యశాల పొందలేని పరిస్థితుల్లో సోమవారం గంటల తరబడి ప్రజలు ఒపి కోసం పడిగాపులు పడ్డారు. సోమవారం ఒపి కౌంటర్ వద్ద సర్వర్ పనిచేయకపోవడంతో రోగులు నిలబడలేక ఇబ్బంది పడ్డారు. దీనికితోడు రోగులు ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకురావాలని సిబ్బంది చెప్పడంతో రోగులు మరింతగా ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటివరకు రోగుల వద్ద ఫోన్ ఉండి ఆధార్ నెంబర్ చెబితే ఆన్‌లైన్‌లో ఒపి రిజిస్ట్రేషన్ పూర్తయ్యేది. ప్రస్తుతం ఒరిజినల్ ఆధార్ కార్డు కావాలని కోరడంతో రోగులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 9 గంటలకు వెళ్ళినా వారు సైతం మధ్యాహ్నం 12:30 వరకు ఒపి కౌంటర్ వద్ద బారులు తీరి నిలబడినా ఫలితం లేకుండా పోయింది. ఆన్‌లైన్‌కు సంబంధించి సర్వర్లు పనిచేయని సమయంలో పాత పద్ధతిలో ఒపి చీటీలు రాసి వైద్య సేవలు అందించాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సెమీ ఫైనల్స్‌కు ఎనిమిది జట్లు

ప్రజాశక్తి - పిఠాపురం

పోటీల్లో తలపడుతున్న తూర్పుగోదావరి-వైజాగ్ జట్లు

స్థానిక రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న 8వ రాష్ట్ర స్థాయి యూత్ బాల, బాలికల బాస్కెట్ బాల్ పోటీల్లో 3వ రోజు జరిగిన క్వాటర్ ఫైనల్స్ పోటీల్లో వివిధ జిల్లాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి-వైజాగ్, అనంతపురం-గుంటూరు, కృష్ణా - చిత్తూర్, పశ్చిమగోదావరి - కర్నూల్, బాలుర విభాగంలో వైజాగ్-తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి-గుంటూరు, చిత్తూరు- కర్నూలు, కృష్ణా-అనంతపురం జిల్లాల జట్లు పోటీ పడ్డాయి. వీటిలో బాలికల విభాగంలో తూర్పుగోదావరి, అనంతపురం, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల జట్లు, బాలుర విభాగంలో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, చిత్తూరు, కృష్ణా జట్లు సెమి ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

గొల్లప్రోలు జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా మండలంలోని తాడిపత్తి, చిన్నజగ్గంపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మందును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు అమృతరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మానసాదేవి మాట్లాడారు. 1 నుంచి19 సంవత్సరాల పిల్లలు ఆల్బెండజోల్ మందును వేసుకోవడం ద్వారా మట్టి ద్వారా వ్యాపించే నులిపురుగులను నివారించవచ్చని అన్నారు పిల్లల్లో ఏకాగ్రత నులిపురుగుల సంక్రమణను తగ్గిస్తుందని, రోగ నిరోధక శక్తిని మెరుగు పరుస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లీదండ్రులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని తాళ్లూరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మందును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాతి బుజ్జి పాల్గొన్నారు. తొలుత మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును ఆమె పరిశీలించారు. విద్యార్థులు పాఠశాలకు భోజనాన్ని తెచ్చుకోవడంపై ఆరా తీశారు. పాఠశాలలో పెట్టే భోజనం తింటే కడుపులో నొప్పి వస్తుందని విద్యార్థులు వివరించారు. తాగునీరు పరిశుభ్రం చేసే యంత్రం వినియోగంలో లేకపోవడంపై హెచ్ఎంను ప్రశ్నించారు. మరమ్మ తులకు గురియైందని హెచ్ఎం వివరణ ఇచ్చారు. దీనిపై ప్రతిపాదనను రూపొందించి పంపిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కా రానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పూర్ణిమ, సూపర్‌వైజర్ నాగ పార్వతి, కార్యదర్శి షేక్ షకీల, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక జడ్‌పి బాలిక ఉన్నత పాఠశాలలో ఎంఇఒ-2 పి.పుల్లయ్య, రూరల్‌లో వేట్లపాలెంలో ఎంఇఒ -1 వై.శివరామకృష్ణయ్య పాల్గొని నులి పురుగు నివారణ మాత్రలను విద్యార్థు లకు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఎంపిడిఒ కె.హిమ మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి చురుకుగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

ఈనెల 24 నుంచి మార్చి 1 వరకూ భీమేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లును చురుకుగా చేస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి బల్ల నీలకంఠం అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేయడం జరుగుతుందన్నారు. గతంలో సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ఈ ఏడాది ఇంకా ఎక్కువ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లును చేయడం జరుగుతుందన్నారు. 24వ తేదీ సాయంత్రం స్వామి వారి కళ్యాణం, 26వ తేదీ మహాశివరాత్రి, మార్చి 1వ తేదీన పుష్పయాగం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు చెప్పారు.

మానవతావాది సత్యలింగం నాయకర్

ప్రజాశక్తి - కాకినాడ

సర్టిఫికెట్లు బహూకరిస్తున్న నిర్వాహకులు

వంల్లాడి సత్యలింగం నాయకర్ గొప్ప మానవతవాది, అందరికిని ఆదర్శం అని ఎంఎస్ఎన్ చారిటీస్ ఛైర్మన్, వ్యవస్థాపక ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయకర్ అన్నారు. సోమవారం నాయకర్ 110వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తొలుత నాయకర్ రథాన్ని జగన్నాథపురం పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో చారిటీసు విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. చారిటీస్ సహాయక కమిషనర్, కార్యనిర్వాహణాధికారి కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ఉన్నత భావాలు కలిగిన మహోన్నత వ్యక్తి నాయకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో చారిటీ స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి, పూర్వపు ధర్మకర్తల మండలి సభ్యులు పొన్నమండ విజయ్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.ఉషారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయకుమారి, ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంఎస్. సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కొండపోడు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామంలో సర్వే నంబర్ 1 లో ఉన్న 456 ఎకరాల ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ (ఎంఎల్) పార్టీ ఆధ్వర్యంలో సాగుదారులు ధర్నా నిర్వహించారు. సోమవారం చెందుర్తి సచివాలయం వద్ద జరిగిన ధర్నా అనంతరం సచివాలయం కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాగుదారులు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుంచి ఆ భూములను చెందుర్తి, కొడవలి, కొత్త వజ్రకూటం గ్రామాలకు చెందిన బిసి, ఎస్‌సి సామాజికవర్గాలకు చెందిన పేదలు సాగు చేసుకుంటున్నారని అన్నారు. సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. అయినా అధికారులు స్పందించ లేదన్నారు. ప్రస్తుతం ఆ భూములను పారిశ్రామికవేత్తలకు కట్టబట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములపై సాగుదారులంతా హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ కూడా తెచ్చుకున్నామని, కావున అధికారులు సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగుదారులు కె. వెంకటరమణ, టి.శ్రీనివాసరావు, నక్క అప్పన్న, నక్క రాంబాబు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వాలు తిమ్మాపురం మండల పరిషత్ పాఠశాల 1995-2000 సంవత్సరంలో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. నాటి గురువులు వి.రామన్న, శ్రీనివాస్, అంగర గోపాలకృష్ణలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ఉపాధ్యాయులు శ్రీకృష్ణ, శివ, లక్ష్మి, తులసి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసాద్‌బాబు పుట్టినరోజు

ప్రజాశక్తి - తాళ్లరేవు

టిడిపి నాయకుడు జక్కల ప్రసాద్‌బాబు పుట్టిన రోజు వేడుకను టిడిపి గ్రామ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రసాద్‌బాబు నివాసం లో జరిగిన ఈ కార్యక్రమంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి అభిమానులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దున్నా సింహాద్రమ్మ, దడాల మోహన్‌రావు, ఎంటి శ్రీను, పలివెల అప్పారావు, టేకుమూడి సత్యనారాయణ, పి.మహేష్ పాల్గొన్నారు.

తడి - పొడి చెత్తలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని ప్రజలకు తడి - పొడి చెత్తలపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సానిటరీ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణ పరిధిలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి ఇంటి వద్ద పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచాలన్నారు. సానిటరీ సిబ్బందికి తడి-పొడి చెత్తలను విడివిడిగా అందించే విధంగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ సమావేశంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ, సానిటరీ సెక్రటరీలు కె.జయరామ్, ఎం.దుర్గాప్రసాద్, ఎస్‌కె.దాదాజీ, కె.భవాని, ఎం.హైమావతి, మేస్త్రీలు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో ఐఒసి డైరెక్టర్ పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డైరెక్టర్ వి.సతీష్‌కుమార్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి నీలకంఠం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ నందిమండపంలో అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. పూజల్లో తహశీల్దార్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, విఆర్ఒ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

దళితుల అణిచివేతకు వ్యతిరేకంగా పోరాటం

ప్రజాశక్తి - పిఠాపురం

దళితుల అణిచివేతకు, దాడులకు వ్యతిరేఖంగా దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పోరాటం సాగిస్తామని సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సాకా రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఇందిరానగర్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులాల వారికి కార్పోరేషన్ రుణాలు మంజూరు చేస్తున్న ప్రభుత్వం అందులో ఎస్‌సి, ఎస్‌టిలను మినహాయించడం దారుణమన్నారు. గత వైసిపి ప్రభుత్వం దళితులకు 28 రకాల సంక్షేమ పథకాలు ఎత్తి వేసిందన్నారు. కూటమి పార్టీలు ఎన్నికల ముందు దళితులకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని మరచి పాలన సాగిస్తుందన్నారు. దళితుల హక్కుల కోసం సమితి ఆధ్వర్యంలో పోరాటం సాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు భాస్కర్, రాజు, రాంబాబు, రమణ, సత్తి రాజు పాల్గొన్నారు.

10 లక్షల మొక్కలు నాటడమే ధ్యేయం

ప్రజాశక్తి - పెద్దాపురం

పర్యావరణ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా 10 లక్షల మొక్కలు నాటడమే ధ్యేయంగా సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తమిళనాడుకు చెందిన ముత్తు సెల్వన్ అన్నారు. సోమవారం ఆయన తన యాత్రలో భాగంగా పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 17 రాష్ట్రాల్లో యాత్ర కొనసాగించి ఆయా ప్రాంతాల అధికారుల సహాయ సహకారాలతో సుమారు 7 లక్షల మొక్కలు నాటడం పూర్తయిందన్నారు. పట్టణంలో ఈనెల 11వ తేదీన మున్సిపల్ సిబ్బంది సహాయ సహకారాలతో మొక్కలు నాటనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. సోమవారం కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో శంఖవరం మండలం కొంతంగి, కొత్తూరు, రౌతులపూడి మండలం ఎం. చామవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అడపా మురళీ, కుర్రా సత్యనారాయణ పాల్గొన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేని వేగవంతం చేయాలని తహశీల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి ఆదేశించారు. ఇప్పటివరకు నిర్వహించిన భూముల రీసర్వేపై సోమవారం కట్టమూరు సచివాలయం వద్ద సమీక్షించారు. భూముల రీ సర్వేపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సామోరు, విఆర్ఒ నండూరి ప్రసాదరావు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 1546/2019
Creditor I.P. No. 20/2019
Between:
1. యలమాటి వెంకట్రావ్
2. బొబ్బా శ్రీనివాస చౌదరి
...పిటీషనర్స్/ పిటీషనర్స్/ Creditors
AND
1. చిగిలిపల్లి పైడినాయుడు
2. వైట్ల నారాయణరావు
...రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్/ Debtors
To:
చిగిలిపల్లి పైడినాయుడు, S/o. పోతినాయుడు, వయస్సు 60, వ్యాపారం, డోర్ నెం. 5-9-29, ఆంధ్రా బ్యాంక్ వీధి, తర్వానిపేట, మండపేట టౌన్, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఎ.పి. ఆలమూరు DMC.
...2వ రెస్పాండెంట్/ 2nd Debtor
పై నెంబర్ పిటీషన్‌లో 2వ రెస్పాండెంట్/ 2nd Debtor కోర్టు నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపుతున్నా తీసుకొనక బుద్ధిపూర్వకంగా కోర్టు ప్రొసీడింగ్స్ తెలిసికూడా కాలయాపన చేయుచున్నారు. కావున సదరు 2వ రెస్పాండెంట్ / 2nd Debtor **ది.వి. 25-02-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు నందు మీరు స్వయంగా గాని, లేదా మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై నెంబర్ పిటీషన్‌లో తమకు ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ తెలియజేసుకోవలెను. ఆరోజున మీరు కోర్టుకి హాజరు కాని పక్షంలో మీకు వ్యతిరేకంగా తీర్మానించబడునని ఇందుమూలంగా ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
ఎన్.నారాయణమూర్తి, అడ్వకేట్
రామచంద్రపురం రామచంద్రపురం
8-2-2025 సెల్: 9866486470

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, (PRINCIPAL DISTRICT JUDGE) AT: KHAMMAM
MATO.P.NO. 261 OF 2024
BETWEEN:-
Duggirala Anathalaxmi and others ...Claim Petitioners
AND
B Murali Krishna and others ...Respondents
To.
Respondent No.1: B Murali Krishna S/o. Devudu, Age: Major, Occ: Driver of Lorry Bearing No. KA 34 C-6085, R/o. H. No. 82-16-48, Bharma Colony, Rajahmundry city, East-Godavari District-533101.
Take Notice that the above named Claim Petitioners have filed the above O.P. against the respondents claiming compensation. The above case is stands posted to 05-03-2025 for your appearance. There fore, you are here by directed to appear before the Hon'ble court on 05-03-2025 at about 10-30 A.M. in person or through an advocate without fail. Failing which the matter will be decided ex-parte against you.
// by order of the Hon'ble court//
09-02-2025
Khammam.
Yeginati Nageswar Rao
Advocate, Khammam
CELL.No.98483 68823

CHANGE OF NAME
I, **THAMMINENI GANGARATNAM** (OLD NAME) W/O LATE RAMAMOHAN RAO D.NO.5-76, RAMALAYAM STREET, PRAKASARAO PALEM, NALLAJERLA, EAST GODAVARI DISTRICT, I HAVE CHANGED MY NAME AS **TAMMINENI GANGARATNAM** (New Name). HEREAFTER MY NAME IS KNOWN AS **TAMMINENI GANGARATNAM** (NEW NAME) FOR ALL PRACTICAL PURPOSES.

CHANGE OF NAME
I, RAJIYA SAYAD, W/o. Sayad Haazi, D.No. 44-16-7/8, Thota Veedhi, Annapurnammapeta, Rajamahendravaram, E.G.Distrct, A.P., PIN: 533101, A.P. I have changed my name from **SYED RAJIYA** (Old Name) to **RAJIYA SAYAD** (New Name). Hence forth Iam being called **RAJIYA SAYAD,** W/o. Sayad Haazi, for all purpose.

CHANGE OF NAME
I, **THAMMINENI SUJATHA** (OLD NAME) W/O HANUMA VENKATA PRASAD, D.NO.5-76, RAMALAYAM STREET, PRAKASARAO PALEM, NALLAJERLA, EAST GODAVARI DISTRICT, I HAVE CHANGED MY NAME AS **TAMMINENI SUJATHA.** (New Name). HEREAFTER MY NAME IS KNOWN AS **TAMMINENI SUJATHA** (NEW NAME) FOR ALL PRACTICAL PURPOSES.

మహారాజశ్రీ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 305/2023
Between:
షేక్ నాగూర్ సాహెబ్ -వాది
AND
షేక్ సత్తార్ సాహెబ్ & 3 అదర్స్ -ప్రతివాదులు
To:
2. షేక్ యాకుబీబీ, W/o. లేటు లాల్ సాహెబ్, ముస్లిమ్, వయస్సు 64 సం॥లు, గృహిణి, చెన్నావారి వీధి, మండపేట పట్టణం & మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఎ.పి., ఆలమూరు DMC.
4. షేక్ సుబాన్ సాహెబ్, S/o. లేటు లాల్ సాహెబ్, ముస్లిమ్, వయస్సు 45 సం॥లు, టైలరింగ్ షాపు, చెన్నావారి వీధి, మండపేట పట్టణం & మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఎ.పి., ఆలమూరు DMC.
...2nd & 4th ప్రతివాదులు
పై నెంబర్ దావాలో 2 మరియు 4వ ప్రతివాదులు అయిన మీరు కోర్టు నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపుతున్నా తీసుకొనక బుద్ధిపూర్వకంగా కోర్టు ప్రొసీడింగ్స్ తెలిసికూడా కాలయాపన చేయుచున్నారు. కావున 2వ మరియు 4వ ప్రతివాదులు **దివి. 07-03-2025వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు నందు మీరు స్వయంగా గాని, లేదా మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై దావాలో మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ తెలియజేసుకోవలెను. ఆరోజు మీరు కోర్టుకి హాజరు కాని పక్షంలో మీకు వ్యతిరేకంగా తీర్మానించబడునని ఇందుమూలముగా ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
చల్లా సతీష్, అడ్వకేట్
ఆలమూరు ఆలమూరు
10-2-2025 సెల్: 9030314955

NAME CHANGE
I am MUPPIDI GANGARAJU, S/O VENKATESWARLU, nidadavole mandal, D.Muppavaram Village, East Godavari District, Andrapradesh,
My Father Name mentioned in my Passport no.M0109000 MUPPIDI VENKATESH, But My Father original name MUPPIDI VENKATESWARLU. I declare that my Father name is **"MUPPIDI VENKATESWARLU'**
MUPPIDI GANGARAJU, S/O VENKATESWARLU
PH NO.8185834815

పేరు మార్పు
తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు మండలం, డి.ముప్పవరం గ్రామ కాపురస్తులు ముప్పిడి గంగరాజు తండ్రి: వెంకటేశ్వర్లు అను నాయొక్క **పాస్‌పోర్టు నెం.ఎమ్0109000** లో నా తండ్రి పేరు ముప్పిడి వెంకటేష్ అని నమోదు కాబడినది. కాని మా నాన్నగారు ఆధార్ కార్డు నెం. 8218 9182 9120 ప్రకారం ముప్పిడి వెంకటేశ్వర్లు కావున ఈరోజు నుంచి ముప్పిడి వెంకటేశ్వర్లు అని పిలవవలసినదిగా ఈ పేపరు ప్రకటన ఇవ్వబడినది.
ముప్పిడి గంగరాజు, తండ్రి: వెంకటేశ్వర్లు
ఫోన్: 8185834815

పిటీషన్ నోటీసు ప్రకటన
మహారాజశ్రీ పెద్దాపురం అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్ట్ మరియు అడిషనల్ జుడిషియాల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి సముఖమునకు
IA No.501/2023
in OS No.279/2021
నూకపల్లి పూర్ణ సూర్యచంద్ర శేఖర్ **పిటీషనరు/ప్రతివాది**
నూకపల్లి చంద్రకాంతం వగైరా **రెస్పాండెంట్లు / వాదులు**
Nookapalli Buli Venkanna, S/o Chandrayya, D.No.1-167/3, Addateegala village Gokavaram Mandal
పై నెంబరు పిటీషన్ పరిహారం నిమిత్తం మీ పయిన పిటీషనరు/ప్రతివాది అను వారు పై కోర్ట్ నందు పిటీషన్ దాఖలు చేసినందున అందుకు ఆక్షేపనలు తెలియచేయుటకు మీరు పై కోర్ట్ వారి ఎదుట **ది.13-03-2025** తేది ఉదయం గం॥ **10-30** ని॥లకు హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియచేయడమైనది.
వాది తరపున అడ్వకేట్
చావలి కృష్ణా రావు
అడ్వకేట్,
D.No.9-1-32 ప్లీడర్ల వీధి
పెద్దాపురం

మహారాజశ్రీ రాజమండ్రి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.1/2025
Between
Nandhyala Satyanarayana (On his own behalf and in the Representative capacity of Other Creditors) **...Petitioner**
And
1. Nagaswami kumar S/o. Nagavaenkatarao, D.No.2-81 Ramalayam veedhi, Muggulla
2. Garapati Srinivas S/o. Basava Raju , D.No.704,J.P.Nagar, Karnataka State
3 Alappati Varalakshmi w/o Manikanta Muggulla **...Respondents**
పై నెంబరు **I.P.1/25** ని 1వ రెస్పాండెంటు అయిన నాగ స్వామి కుమార్‌ని Insolvent గా డిక్లేర్ చెయ్యమని, పిటీషనరు తన తరుపున మరియు మిగిలిన బాకీ దారులు తరుపున రిప్రెజెంటేటివ్ కెపాసిటీలో దాఖలు చేసినందున అందువిషయమై ఎవరికైనా ఆక్షేపణలు వున్నచో వాయిదా రోజు **ది.24.02.25వ** తేదీన ఉదయం **గం॥ 10.30** ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియపర్చుకోవలెను.
మద్దూరి శివ సుబ్బారావు
మద్దూరి శివరామ శశిభూషణ్
రాజమండ్రి అడ్వకేట్స్,
ది.10-02-2025 రాజమహేంద్రవరం

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో అనపర్తి
E.P.No.26/2024
O.S.No.105/2020
Between:
సత్తి కొండారెడ్డి ...**D.H.R/Plaintiff**
మరియు
సత్తి సోమిరెడ్డి S/o. సత్యన్నారాయణ రెడ్డి, D/o. 3-97, కొమరిపాలెం గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరిజిల్లా
...**J.D.R/Defendent**
పై నంబరు దావా గ్రంథములో **J.D.R/Defendent** అయిన మీకు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపిననూ కావాలనే తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా తెలియచేయటమైనది. **ది.12-03-2025** వ తేదీన **ఉ.10.30ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అభ్యంతరములు తెలియచేయగలరు లేనిచో మీ పరక్షమున తీర్మానించబడును.
"శ్రీ కోర్టు వారి అనుమతితో ఈ ప్రకటన"
సత్తివీర రాఘవరెడ్డి
D.H.R తరపు న్యాయవాది
అనపర్తి రాజమమహేంద్రవరం
ది.08.02.2025 సెల్.9346322113

CHANGE OF NAME
I, **THAMMINENI HANUMAN VENKATA PRASAD** (OLD NAME) S/O LATE RAMAMOHAN RAO, D.NO.5-76, RAMALAYAM STREET, PRAKASARAOPALEM, NALLAJERLA, EAST GODAVARI DISTRICT, ANDHRA PRADESH. I HAVE CHANGED MY NAME AS **TAMMINENI HANUMA VENKATA PRASAD** (NEW NAME). HEREAFTER MY NAME IS KNOWN AS **TAMMINENI HANUMA VENKATA PRASAD** (NEW NAME) FOR ALL PRACTICAL PURPOSES.

CHANGE OF NAME
I, SAYYAD SIRAJ PARVEEN, W/o Noor, and Residing at 2-20-15/10, Shanthi Nagar, Nidadavole, E.G.Dist., I have Changed my name from **SYED SIRAZ PARVEEN (OLD NAME)** to **SAYYAD SIRAJ PARVEEN (NEW NAME).** Henceforth I am being called as **SAYYAD SIRAJ PARVEEN** for all purposes.